సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



మాయమవుతున్న పచ్చ బంగారం

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో దుండగులు పసుపు కొమ్ముల చోరీకి పాల్పడుతూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు.

- 8లో ▸



అభ్యంతరాలు ఉంటే తెలపాలి

పరిషత్ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని అదనపు కలెక్టర్ రాజకీయ పార్టీలను కోరారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /14.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి వేళ చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

- డీఆర్‌డీవో సాయాగౌడ్



నిజామాబాద్‌అర్బన్ : స్వయం సహాయక సంఘ సభ్యులు ఆరోగ్యం, పోషణపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి ఆహారపు అలవాట్లు మనిషి ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా పది ఆరోగ్య అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు, డీపీఎం సాయిలు, శ్రీనివాస్, ఏపీఎంలు సరోజ, గంగాధర్, రాజేందర్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ

- బరిలో 56 మంది పట్టభద్రులు, 15 మంది ఉపాధ్యాయులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు వేసిన 13 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇందులో 12 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కాగా, ఒక్కరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియగా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది పోటీ పడుతున్నారు.

కీటక జనిత వ్యాధుల నియంత్రణకు పాటుపడాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ



నిజామాబాద్‌నాగారం : కీటక జనిత వ్యాధుల నియంత్రణకు పాటుపడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, నోడల్ సూపర్‌వైజర్, సబ్ యూనిట్ అధికారులతో డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, ఫైలేరియా, డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్లు మలేరియా రక్త పరీక్షలను పెంచాలని, నోడల్ అధికారులు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు యాంటీ లార్వా స్ప్రే, ఫ్రైడే డ్రైడే చేపట్టాలని ఆదేశించారు. కీటక జనిత వ్యాధులపై ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏ ఇంటి వద్ద కూడా దోమల లార్వాలు కనిపించకుండా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. జిల్లా ఉపవైద్యాధికారులు డివిజన్ల వారీగా వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించి కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకా రాం రాథోడ్, అసిస్టెంట్ మలేరియా అధి కారి అబ్దుల్ సలీం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమంటే బాధ్యత..



ప్రేమ విలువను తగ్గించొద్దు

- ఆకర్షణ.. ప్రేమకు ఎంతో తేడా
- నిజాయితీతో కూడిన ప్రేమలో బాధ్యత ఉంటుంది
- కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి
- తల్లిదండ్రులకు మంచిపేరు తెస్తూ ప్రేమను గెలిపించుకోవాలి

టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది.. సామాజిక మాధ్యమాలు స్వార్థంతో కూడిన ప్రేమకు దారులు వేస్తున్నాయి. ఆకర్షణే ప్రేమనుకొని చిన్న వయస్సులోనే కొంతమంది ఇబ్బందులను కొనితెచ్చుకుంటున్నారు. దాడులు, అఘాయిత్యాలకు బలవుతున్నారు. ఏనాటికైనా స్వచ్ఛమైన ప్రేమంటే బాధ్యత. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉండటం. యువతీ, యువకులు ప్రేమకు ఉన్న విలువను తగ్గించొద్దు. నిజాయితీ కూడిన ప్రేమలో స్వార్థం ఉండదు. బాగా చదువుకుంటూ లక్ష్యాన్ని సాధించాలి. తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తూ నిజమైన ప్రేమను గెలిపించుకోవాలంటున్నారు నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' నిర్వహించిన డిబేట్‌లో తమ మనోభావాలను పంచుకున్నారు.

– నిజామాబాద్ నాగారం

'సాక్షి' డిబేట్‌లో మెడికల్ కళాశాల విద్యార్థుల మనోగతం



డిబేట్‌లో పాల్గొన్న మెడికల్ కళాశాల విద్యార్థులు

కెరీర్ ముఖ్యం



ప్రేమ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రేమ కేవలం ఇద్దరికి మాత్రమే కావాలి. కలిసి జీవించాలంటే ప్రేమతోపాటు డబ్బు అవసరం. అందుకే ప్రేమ పేరుతో సమయాన్ని వృథా చేసుకోవద్దు. ఫస్ట్ కెరీర్ ముఖ్యం.

– వర్షిత్, ఎంబీబీఎస్, ఫస్టియర్

అనవసర రిలేషన్ వద్దు



ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రేమ పేరిట వేధింపులు ఎక్కువవుతున్నాయి. చాలా జాగ్రత్తగా ఉండాలి. అమ్మా నాన్న, తోబుట్టువు ఇలా ఎవరితోనైనా ప్రేమగా ఉండొచ్చు. అనవసరమైన రిలేషన్ పెట్టుకోవద్దు.

– నిర్మల్ బాటియ, ఎంబీబీఎస్, ఫస్టియర్

ప్రేమకు అడ్డంకులు ఉండవు



నిజమైన ప్రేమకు అడ్డంకులు ఉండవు. స్వచ్ఛమైన ప్రేమకు విలువ ఉంటుంది. ఆ ప్రేమ తల్లి, తండ్రి, కుటుంబసభ్యుల మధ్య కూడా ఉంటుంది. ప్రేమించలేదని, ప్రేమను అంగీకరించలేదని ఆత్మహత్య చేసుకోవద్దు. జీవితంలో ఉన్నతంగా ఎదగాలి.

– ధీరజ్‌రెడ్డి, ఎంబీబీఎస్, ఫస్టియర్

ప్రేమ పేరుతో దాడులొద్దు



ప్రేమ పేరుతో దాడులు, అఘాయిత్యాలకు పాల్పడటం నేరం. నిజమైన ప్రేమంటే బాధ్యత అని గుర్తుంచుకోవాలి. ఇద్దరి మధ్య ప్రేముంటే.. అది బాధ్యతతో కూడుకున్నదై ఉండాలి. అప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుంది.

–సామ్‌సన్, ఎంబీబీఎస్, ఫస్టియర్

నిజమైన ప్రేమ అనంతం



నిజమైన ప్రేమను నిర్వచించలేం. ప్రేమంటే కేవలం ఫిబ్రవరి 14న జరుపుకొనేది కాదు. కష్టాలు, బాధలను పంచుకోవాలి. ఒకరికొకరు సాయం చేసుకోవాలి. చిన్న సమస్యలు వస్తే పరిష్కరించుకుంటూ థాంక్యూ చెప్పుకోవాలి.

– మౌన, ఎంబీబీఎస్, ఫస్టియర్

గౌరవించుకోవాలి



ప్రేమలో ఎమోషన్స్ ఎక్కువగా ఉంటాయి. అనవసర నిబంధనలు పెట్టుకోవద్దు. ప్రేమలో ఒత్తిడి ఉండొద్దు. ఒకరినొకరు గౌరవించుకోవాలి. ముందు చదువుపై దృష్టిసారించి లక్ష్యాన్ని చేరుకోవాలి. ఆ తర్వాతే ప్రేమ గురించి ఆలోచిస్తే జీవితం సాఫీగా సాగుతుంది.

– డి. వైష్ణవి, ఎంబీబీఎస్, ఫస్టియర్

ప్రేమే జీవితం కాదు



ప్రస్తుతం యువత, విద్యార్థులు ప్రేమ పేరుతో వ్యసనాలకు బానిసవుతున్నారు. ప్రేమించడం లేదని, గంజాయి, మద్యం తాగుడు అలవాటు చేసుకుంటున్నారు. ప్రేమే జీవితం కాదు. అందరికీ నచ్చేలా కాకున్నా ఎవరికి వారు లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకెళ్లాలి.

– రీతు, ఎంబీబీఎస్, ఫస్టియర్

ఆకర్షణ ప్రేమ కాదు



ప్రేమ వేరు.. ఆకర్షణ వేరు. ఆకర్షణే ప్రేమ అనుకోవద్దు. కొంతమంది ఇష్టపడటాన్ని ప్రేమ అంటున్నారు. ప్రస్తుతం చాలామంది టైంపాస్‌గా ప్రేమిస్తున్నారు. ప్రేమిస్తే ఎంతటి కష్టాలొచ్చినా వదిలేయొద్దు. ఇద్దరి మధ్య దాపరికం ఉండొద్దు. ఏదీ ఏమైనా నీతోనే ఉంటాననే ధైర్యమివ్వాలి. – తనూజ, ఎంబీబీఎస్, ఫస్టియర్

మంచి, చెడు ఉంటాయి



ప్రేమలో మంచి, చెడు రెండూ ఉంటాయి. వాటిని గుర్తించి ముందుకెళ్లాలి. మానసికంగా సరిగా ఉన్నప్పుడే ఒకరినొకరు అర్థం చేసుకోగలరు. కొన్ని రోజులు మంచిగా, మరికొన్ని రోజులు చెడుగా ఉండొచ్చు. పరిస్థితులను అర్థం చేసుకొని మెలగాలి.

– సంఘాల కీర్తన, ఎంబీబీఎస్, ఫస్టియర్

ముందు కెరీర్.. ఆ తర్వాతే ప్రేమ



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నతంగా జీవించాలంటే కచ్చితంగా మొదట లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించాలి. అటు తర్వాతే ప్రేమ గురించి ఆలోచన చేయాలి. ఏది తప్పో, ఒప్పో కూడా గుర్తించాలి. ప్రేమంటే ఇచ్చిపుచ్చుకోవడం. ప్రేమలో నిజాయితీ ఉండాలి. చిన్న వయస్సులోనే ప్రేమ పేరిట జీవితాలను నాశనం చేసుకోవద్దు. బాగా చదువుకొని ఉన్నతమైన మార్గంలో పయనించాలి. నలుగురికి ఆదర్శంగా ఎదిగేలా మీ జీవితాన్ని మీరే తీర్చిదిద్దుకోవాలి.

– డాక్టర్ ఎం. స్వాతి, హెచ్‌వోడీ, బయోకెమిస్ట్రీ

ప్రేమ వివాహం చేసుకొని సక్సెస్ అయ్యారు

- గైని గంగారాం, పద్మావతి



నిజామాబాద్‌నాగారం: ప్రేమ పేరు చెబితేనే భయపడే రోజుల్లోనే గైని గంగారాం, పద్మావతి 1988 ఫిబ్రవరి 5న లవ్‌మ్యారేజ్ చేసుకున్నారు. నగరంలోని గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో గైని గంగారాం నాందేవ్‌వాడలో అద్దెకు ఉండేవాడు. ఆ పక్కనే పద్మావతి కుటుంబం ఉండడంతో పరిచయం కాస్త ప్రేమగా మారింది. 1987 నవంబర్‌లో గంగారాం పీజీ చేస్తుండగా ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం వచ్చింది. మూడు నెలల జీతం తీసుకున్న తర్వాత స్నేహితుల సహకారంతో ఎడపల్లి మండలం జానకంపేటలోని శ్రీ లక్ష్మినర్సింహస్వామి ఆలయంలో గంగారాం, పద్మావతి వివాహం చేసుకున్నారు. అదే రోజు బోధన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పెళ్లిని నమోదు చేసుకున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగారు. గంగారాం ఉద్యోగ జీవితంలో తనదైన ముద్ర వేసుకుంటూ టీఎన్జీవోస్‌లో కీలక పదవులకు వన్నె తేవడంతోపాటు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. గైని గంగారాం, పద్మావతి దంపతుల కుమారుడు సాయికిరణ్ ఆడిటర్‌గా, కోడలు రోహిణి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం చేస్తున్నారు. కూతురు యామిని, అల్లుడు గౌతమ్ డాక్టర్లుగా పని చేస్తున్నారు. ఎవరైనా ప్రేమిస్తే కచ్చితంగా లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నతంగా ఎదిగిన తర్వాతే ప్రేమ వివాహం చేసుకోవాలని చెబుతున్నారీ దంపతులు.

వీరి ప్రేమ పెళ్లికి ఏడేళ్ల నిరీక్షణ

- నేటి తరానికి ఈ దంపతులు ఆదర్శం..స్ఫూర్తిదాయకం



బోధన్: బోధన్‌లోని సరస్వతీనగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు లలిత, ఆర్టీసీ ఉద్యోగి లోగం సుదర్శన్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరి అన్యోన్య దాంపత్య జీవితం నేటితరం యువతకు ఆదర్శం, స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరూ ఇంటర్ వరకు క్లాస్‌మేట్స్. ఇద్దరి మధ్య ఉన్న స్నేహం ప్రేమగా మారింది. తల్లిదండ్రులు, కుటుంబీకులను ఒప్పించి పెళ్లి చేసుకునేందుకు సుమారు ఏడేళ్లపాటు నిరీక్షించారు. 1990లో సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకున్నారు. ఆ సమయంలోనే సుదర్శన్‌కు ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగం వచ్చింది. పెళ్లి తర్వాత భర్త ప్రోత్సాహంతో బీఈడీ పూర్తిచేసిన లలితకు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం పట్టణంలోని తట్టికోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి ఏకైక కూతురు స్ఫూర్తిదర్శన్‌ను ఎంబీబీఎస్, ఎంఎస్ చదివించి పెళ్లి చేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో వైద్యురాలిగా స్థిరపడింది. 'ప్రేమ పెళ్లి అంటేనే కష్టాలుంటాయి. వాటికి భయపడొద్దు. తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పించే ప్రయత్నాలు చేయాలి. ప్రేమ పెళ్లి చేసుకొని ఆర్థికంగా స్థిరపడితే అందరూ దరి చేరుతారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రేమను అర్థం చేసుకొని మేమున్నామనే ధైర్యం ఇస్తే.. ఆత్మహత్యలు చాలా వరకు ఉండవు' అని చెబుతున్నారు ప్రభుత్వ ఉపాధ్యాయురాలు లలిత.

భ్రూణ హత్యలను నిర్మూలించాలి

- బాలికలను ఎదగనివ్వాలి
- డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న

మోపాల్(నిజామాబాద్‌రూరల్): భ్రూణహత్యలను నిర్మూలించి, మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను ఎదగనివ్వాలని డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ స్వప్న పిలుపునిచ్చారు. బేటీ బచావో.. బేటీ పడావో పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా బాలల సంక్షేమ శాఖ సంయుక్తాధ్వర్యంలో గురువారం నగర శివారులోని బోర్గాం(పీ) జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ భ్రూణ హత్యలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, పిల్లలపై అఘాయిత్యాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మైనర్లకు పెళ్లి చేయడం, భ్రూణహత్యలకు పాల్పడటం ద్వారా బాలికలు, మహిళల మరణాలు ఎక్కువయ్యాయని తెలిపారు. డీహెచ్‌ఈడబ్ల్యూ జీఎస్ సౌమ్య, ఐసీపీ సునీత షార్ట్‌ఫిల్మ్‌ల ద్వారా బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జకీరా, స్వరూప, సమీనా, ప్రధానోపాధ్యాయుడు శంకర్, మెడికల్ ఆఫీసర్ సంతోష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, సువర్ణ, ప్రేమలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు

చిరుద్యోగి మొరవినరూ..

- ఎనిమిది నెలలుగా జీతాల్లేవ్..
- వసతిగృహాల నాలుగో తరగతి ఉద్యోగుల అవస్థలు
- ఇంటి ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వాళ్లంతా చిరుద్యోగులు. కనీస మొత్తం సైతం లేని వేతన జీవులు. ఏదో విదుల్చుతున్నామన్నట్లుగా నామమాత్రంగా జీతాలిస్తోందీ ప్రభుత్వం. ఆ వేతనాలనూ సక్రమంగా ఇవ్వకపోవడంతో నానా అగచాట్లు పడుతున్నారీ నాలుగో తరగతి ఉద్యోగులు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో అటెండర్లు, స్వీపర్లు, కుక్, వాచ్‌మెన్లుగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఎనిమిది నెలలుగా జీతాలు అందడం లేదు. జిల్లాలో 150 మంది వరకు ఉన్న ఈ నాలుగో తరగతి ఉద్యోగులకు 2024 జూన్ నుంచి 2025 జనవరి వరకు వేతనాలు రాలేదు. ఒక్కో అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి నెలకు ఇచ్చేది కేవలం రూ.15,500 నామమాత్ర వేతనమే. ఇందులోనే ఈఎస్ఐ, పీఎఫ్‌ను మినహాయిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ-కుబేర్‌లో జూన్, జూలై, ఆగస్టు జీతాలు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

భారమవుతున్న కుటుంబ పోషణ..

ఎనిమిది నెలలుగా వేతనాలు లేకుండానే విధులు నిర్వర్తిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కనీస అవసరాలకు డబ్బుల్లేక అగచాట్లు పడుతున్నారు. నిత్యావసరాలకు అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పిల్లల అవసరాల నేపథ్యంలో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వేతన జీవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు, కుటుంబపోషణతోపాటు విధుల నిర్వహణలో భాగంగా వసతిగృహాలకు వెళ్లేందుకు సైతం ఆటో చార్జీలు లేక అష్టకష్టాలు పడుతున్నామని చెబుతున్నారు. కొన్నిసార్లు అప్పు అడిగితే ఎవరూ ఇవ్వటంలేదని కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని కోరుతున్నారు.

రీసర్వే కాదు.. రీపోలింగ్ జరగాలి

- స్థానిక సంస్థల్లో కాంగ్రెస్‌కు జీరో సీట్లే..
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రీసర్వేలు, వాయిదాల పద్ధతి లేకుండా ఏ పథకాన్నీ సక్రమంగా అమలు చేయడం లేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరగాల్సింది రీసర్వే కాదు, రీపోలింగ్ అని స్పష్టం చేశారు. ఎలక్షన్ ఎప్పుడొచ్చినా ప్రజల సెలక్షన్ కేసీఆరేనని, రేవంత్‌రెడ్డిని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఢిల్లీలో ఆప్‌ను కాంగ్రెస్సే ఓడించిందని ఆరోపించారు. మహారాష్ట్రలో మూడు ప్రధాన పార్టీలతో కలిసి పోటీ చేసినా కాంగ్రెస్ ఎందుకు ఘోరంగా ఓడిపోయిందో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అనేకసార్లు ఢిల్లీ వెళ్లినా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరకడం లేదని పేర్కొన్నారు. తాజాగా కులగణన రిపోర్టు పట్టుకెళ్లినా రేవంత్‌ను కాంగ్రెస్ అధిష్టానం పట్టించుకోలేదన్నారు. ఆరు హామీలపై ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతోపాటు రేవంత్ ముఖం చూడటం ఇష్టంలేకనే రాహుల్ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జీరో సీట్లు వస్తాయన్నారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ నాయకులను గ్రామ పొలిమేరల్లోకి రాకుండా తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి పోటీచేసినా వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మాక్లూర్ మాజీ ఎంపీపీ మాస్త ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని పలు కేంద్రాల్లో కొనసాగుతున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలను గురువారం జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో మూడో స్పెల్ ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ప్రయోగ పరీక్షలు జరుగుతున్న నిర్మల హృదయ జూనియర్ కళాశాల, క్రిసెంట్ జూనియర్ కళాశాల, ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల, స్టాండర్డ్ జూనియర్ కళాశాల, గోల్డెన్ జూబ్లీ జూనియర్ కళాశాల, ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దిన్ అస్లామ్, కనకమహాలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని మరో 12 కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



గోదావరి

నిజామాబాద్ నాగారం: ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామానికి చెందిన ఎం గోదావరి జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ ఉమెన్స్ జట్టుకు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం గోదావరి స్పోర్ట్స్ కోటాలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తోంది. జాతీ య స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారిణి ఎంపికవడంపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు లింగయ్య, కార్యదర్శి గంగాధర్, కోశాధి కారి సురేందర్, కార్యవర్గ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు పలువురు అభినందనలు తెలిపారు.త్వరలో హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున రాష్ట్ర జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహించనున్నారు.

మాయమవుతున్న 'పచ్చ బంగారం'

- మార్కెట్ యార్డులో వరుస దొంగతనాలు!
- నిత్యం క్వింటాళ్లలో పసుపు చోరీ
- బుధవారం రాత్రి నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆకస్మిక తనిఖీ
- చోరీల నివారణకు పకడ్బందీ చర్యలు



నిజామాబాద్ ఏఎంసీలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు దొంగలు బరి తెగిస్తున్నారు. వరుస దొంగతనాలకు పాల్పడుతూ రైతులు, వ్యాపారులు, అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రివేళల్లో కిలోల కొద్దీ పసుపును చోరీ చేస్తున్నారు. పలు కమీషన్ ఏజెంట్ల దుకాణాల్లోని సిబ్బంది, కార్మికులు కుమ్మక్కై చోరీకి పాల్పడిన ఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. వరుస చోరీలను అటు అధికారులు, ఇటు మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, యార్డులో కట్టుదిట్టమైన భద్రతకు నిర్ణయించారు.

కట్టుదిట్టమైన భద్రత..

మార్కెట్‌యార్డులో పసుపు, ఇతర పంటల చోరీలను చైర్మన్ ముప్ప గంగారెడ్డి సహా అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. దొంగతనాల నివారణకు కట్టుదిట్టమైన భద్రత కల్పించడంతోపాటు దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక గస్తీదళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో చైర్మన్ ముప్ప గంగారెడ్డి బుధవారం అర్ధరాత్రి 2 గంటల వరకు మార్కెట్‌యార్డును ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు సమాచారం. దొంగతనానికి పాల్పడిన వారిని ఉపేక్షించొద్దని, ఇటీవల చోరీకి పాల్పడిన వారిని విధుల్లో నుంచి తొలగించాలని కమీషన్ ఏజెంట్లను ఆదేశించినట్లు తెలిసింది.

దొంగతనాలు పరిపాటే..

శ్రద్ధానంద్ గంజ్‌లో పసుపు దొంగతనం పరిపాటిగా మారిందని రైతులు వాపోతున్నారు. చాటా, ముల్లె, హమాలీ, దడువాయి, మునీమ్‌లు కలిసి చోరీలకు పాల్పడుతుంటారని, ఇది ఏళ్లుగా జరుగుతున్న తతంగమని ఆరోపిస్తున్నారు. నిత్యం క్వింటాళ్ల పసుపు మాయమవుతోందని, ఈ విషయాన్ని పలుమార్లు కమీషన్ ఏజెంట్లు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అదనుగా భావిస్తున్న కార్మికులు బరి తెగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఓ కమీషన్ ఏజెంట్ దుకాణంలో నాలుగైదు క్వింటాళ్ల పసుపు విక్రయిస్తుండగా, మరో కమీషన్ ఏజెంట్ దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ చేస్తుండగా పట్టుకున్న ఘటనలే అందుకు నిదర్శనం.

అభ్యంతరాలు ఉంటే తెలపాలి

- అదనపు కలెక్టర్ అంకిత్
- 'పరిషత్ ఎన్నికల' ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై ఏవైనా మార్పులు, చేర్పులు అవసరం ఉంటే సూచనలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ రాజకీయ పార్టీలను కోరారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీసీ హాల్‌లో గురువారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించినట్లు తెలిపారు. ఈ నెల 11న అన్ని గ్రామ పంచాయతీలలో ముసాయిదా జాబితాను ప్రకటించామన్నారు. జిల్లాలోని 31 మండలాల పరిధిలో 307 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, 851770 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈమేరకు మొత్తం 1564 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు వచ్చిన పక్షంలో వాటిని పరిష్కరించి, త్వరలో పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సాయాగౌడ్, డిప్యూటీ సీఈవో సాయన్న, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్, పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



తెలంగాణ జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి పలువురు బాలబాలికలు ఎంపికయ్యారు. ఈనెల 13 నుంచి 16వరకు మహారాష్ట్రలో జరగనున్న పోటీల్లో ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగంలో తెలంగాణ జట్టు తరపున వారు ప్రాతినిత్యం వహించనున్నారు. రాష్ట్ర జట్లకు కోచ్‌గా తొర్లికొండ జెడ్పీహెచ్ఎస్ పీడీ మర్కంటి గంగా మోహన్ వ్యవహరిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగమణి తెలిపారు. ఎంపికైనా క్రీడాకారులు వీరే..

బాలుర విభాగంలో..

పెనకంటి వర్షిత్ రాష్ట్ర జట్టు కెప్టెన్ (సత్యశోధక్ పాఠశాల, సిరికొండ), మర్కంటి నిహాల్ చంద్ర (నారాయణ హైస్కూల్, ఆర్మూర్), పుప్పాల నివాస్ (సాంఘిక సంక్షేమ పాఠశాల, బోధన్), తిట్ల రోహన్ (సాంఘిక సంక్షేమ పాఠశాల, ఆర్మూర్)

బాలికల విభాగంలో..

కుస్తాపురం అహల్య రాష్ట్ర జట్టు కెప్టెన్ (సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఆర్మూర్), చిక్కాల శ్రీవర్షిని (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తొర్లికొండ), కాకర్ల నిహారిక (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముచ్కూర్), పసుల సమన్విత (సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ధర్మారం) ఎంపికయ్యారు.



సీతారాముల వారికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

వైభవంగా సీతారాముల వనవిహారం



డిచ్‌పల్లి జాతరలో భక్తుల సందడి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో నిర్వహిస్తున్న సీతారామచంద్రస్వామి వారి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల వన విహారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు సుమిత్ శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఉదయం హోమం, పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం గ్రామ శివారులోని మామిడి తోటలో సీతారాముల ఉత్సవమూర్తులను వనవిహారం చేయించారు. ఈసందర్భంగా చక్రతీర్థం(జాతర) నిర్వహించారు. జాతరలో వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు కాగా, భక్తులు భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. రాత్రికి సీతారాముల వారిని గజవాహనంపై ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్వామి వారి ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధానార్చకులు సుమిత్ శర్మ దేశ్‌పాండే తెలిపారు. భక్తులకు బచ్చు లక్ష్మీనారాయణ కుమారులు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, బూస సుదర్శన్, యాదగిరి, వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు రాములు, నర్సారెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మణ్, సాయిలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుంభమేళాకు వెళ్తూ.. అనంత లోకాలకు

- లారీని ఢీకొన్న కారు
- ఒకరు మృతి.. ఐదుగురికి గాయాలు
- బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో ఘటన



లారీ వెనుక భాగంలో చొచ్చుకుపోయిన కారు

బాల్కొండ: ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా వెళ్లేందుకు గురువారం హైదరాబాద్ నుంచి ఆరుగురు ప్రయాణికులతో బయలుదేరిన కారు ప్రమాదవశాత్తు లారీని ఢీకొట్టింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం చిట్టాపూర్ హైవే 44పై జరుగగా, ఒకరు మృతి చెందారు. ఐదుగురికి గాయాలయ్యాయి. బాల్కొండ ఇన్‌చార్జి ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన పోతు రమేష్, చంద్రశేఖర్ చారి, వనం శ్రీనివాస్, రజనీకాంత్, పోతు సాయివిశాల్, వనం సంపత్ రాణాలు కారులో హైదరాబాద్ నుంచి బయలుదేరారు. బాల్కొండ మండలం చిట్టాపూర్ శివారుకు వరకు రాగానే ముందున్న లారీని ఓవర్ టేక్ చేసేందుకు కారును ఎడమవైపు తిప్పారు. అదేసమయంలో లారీ కూడా ఒక్కసారిగా ఎడమ వైపు తిరగడంతో కారు లారీ వెనుక భాగంలోకి చొచ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన వనం సంపత్ రాణా (35) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఆర్మూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీపై కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

■ నదిలో గల్లంతై.. శవమై తేలి..

రెంజల్(బోధన్): గోదావరి నదిలో పుణ్య స్నానాలకు వచ్చిన ఓ వ్యక్తి నీటిలో గల్లంతై, శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా..కోటగిరి మండల కేంద్రానికి చెందిన సాయిబాబా(40) అనే వ్యక్తి మేనమామ మక్కయ్యతో కలిసి బుధవారం పౌర్ణమి సందర్భంగా రెంజల్ మండలం కందకుర్తి గోదావరి నదిలో స్నానానికి వచ్చారు. కానీ సాయిబాబా ప్రమాదవశాత్తు నీటమునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అదే రోజు స్థానిక జాలర్లలతో నదిలో గాలింపు చేపట్టగా, ఫలితం లభించలేదు. గురువారం ఉదయం తిరిగి జాలర్లు గాలింపు చేపట్టగా మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. మృతుడి భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

■ చేపల వేటకు వెళ్లి బాలుడు..



సాయిరాం మృతదేహం

రుద్రూర్: చేపల వేటకు వెళ్లిన ఓ బాలుడు మంజీరా నదిలో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. పోతంగల్ గ్రామానికి చెందిన సాయిరాం (17) అనే బాలుడు బుధవారం మధ్యాహ్నం చేపలు పట్టడానికి మంజీరా నది వద్దకు వెళ్లాడు. రాత్రి కావస్తున్నప్పటికీ అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలిస్తుండగా మంజీరా నది వద్ద బాలుడి దుస్తులు, చెప్పులను గుర్తించారు. వెంటనే కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు గురువారం నదిలో గాలింపు చర్యలు చేపట్టి, బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

■ పొలంలో మందు చల్లడానికి వెళ్లి రైతు..

రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన సోన్ కాంబ్లే రమేష్ (35) అనే రైతు గురువారం వ్యవసాయ పొలంలో మృతి చెందాడు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా.. హెగ్డోలి శివారులోని తన పొలంలో మందు చల్లడానికి రమేష్ గురువారం ఉదయం ఇంటినుంచి బైక్‌పై వెళ్లాడు. అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లగా, బురదలో బోర్లపడి ఉన్న రమేష్ కన్పించాడు. వెంటనే బయటకు తీయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మందు సంచి తీసుకుని గట్టు పైనుంచి వెళుతుండగా అతడు కాలుజారి బురదనీటిలో పడి చనిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఈమేరకు మృతుడి భార్య సుగుణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

■ చికిత్స పొందుతూ ఒకరు..

వేల్పూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగారం వెంకయ్య(65) బుధవారం తన మోపెడ్ వాహనంపై వేల్పూర్ వైపు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈఘటనలో అతడి తలకు బలమైన గాయాలు కాగా.. అతడి కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం పరిస్థితి విషమించి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కొడుకు విజయ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

■ ఆలూర్‌లో వృద్ధుడు..



ముత్తన్న (ఫైల్)

ఆర్మూర్: ఆలూర్ మండల కేంద్రానికి చెందిన తిర్మన్‌పల్లి ముత్తన్న (60) అనే వృద్ధుడు గ్రామ శివారులోని వెంకటేశ్వర గుట్ట సమీపంలోని కుంటలో పడి మృతిచెందగా స్థానికులు గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య గంగుబాయి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ముత్తెన్నకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతోపాటు, రెండు రోజులుగా ఇంటికి రావడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రాథమిక విచారణలో అతడు మద్యంమత్తులో ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పోలీసులు ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో దూడ మృతి



పెర్కిట్(ఆర్మూర్)/ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో గురువారం నీరడి రాజాకు చెందిన పశువుల కొట్టంపై నాలుగు కుక్కలు దాడి చేశాయి. కొట్టంలో మేత మేస్తున్న లేగదూడపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి ప్రాణాలు తీశాయి. కుక్కలు మూగ జీవిని పీక్కు తిన్న హృదయవిదారక ఘటన యజమానితోపాటు అందరిని కలిచి వేసింది. పట్టణంలో ఇంతగా కుక్కలు చెలరేగిపోతున్నా అధికారుల్లో మాత్రం చలనం లేకుండాపోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ఇసుక డంపుల స్వాధీనం



రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నట్లు కోటగిరి తహసీల్దార్ గంగాధర్ గురువారం తెలిపారు. రాత్రి వేళల్లో మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలించి గ్రామ శివారులో నిల్వ చేసిన సుమారు 48 ట్రాక్టర్ల ఇసుకను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఇసుకను డీడీలు చెల్లించిన వారికి కేటాయిస్తామని తెలిపారు.


నానో టెక్నాలజీతో కాలుష్య రహిత ప్లాస్టిక్



తెయూ రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు, విద్యార్థులతో ప్రొఫెసర్ గంగరాజు

తెయూ(డిచ్‌పల్లి): నానో టెక్నాలజీని ఉపయోగించి కాలుష్య రహిత ప్లాస్టిక్‌ను తయారు చేయవచ్చని దక్షిణ కొరియాకు చెందిన ప్రొఫెసర్ గంగరాజు అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం 'రీసెంట్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ నానో టెక్నాలజీ అండ్ బయో మెడికల్ రీసర్చ్' అనే అంశంపై ప్రొఫెసర్ గంగరాజు ఉపన్యాసించారు. నానో టెక్నాలజీ, నానో కణాల తయారీ, ఉపయోగాలను వివరించారు. వివిధ వ్యాధులకు సంబంధించి స్కానింగ్స్‌లో కూడా నానో కణాలు కూడా అత్యంత అద్భుతంగా పనిచేస్తాయన్నారు. అనంతరం గంగరాజును తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి అభినందించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి సాయిలు, అధ్యాపకులు నాగరాజు, బాలకిషన్, ప్రవీణ్, వాసం చంద్రశేఖర్, మహేందర్, సత్యనారాయణ, కిరణ్మయి, రాజేశ్వరి, డేనియల్, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

కుస్తీమే సవాల్..





ఎడపల్లి మండలం జానకంపేట శ్రీలక్ష్మినర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నిర్వహించిన కుస్తీపోటీలు ఆకట్టుకున్నాయి. చుట్టుపక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కుస్తీ పట్టడానికి మల్లయోధులు వచ్చారు. విజేతలకు రూ.50 నుంచి రూ.2500 వరకు నగదు ప్రోత్సాహకాలను నిర్వాహకులు అందించారు. కుస్తీ పోటీలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

కఠిన చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్: చిలుకూరి బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని రంగరాజన్‌ను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో హిందూ ఆలయాలు, పూజారులపై దాడులను నియంత్రించని పక్షంలో కేంద్ర బలగాలతో శాంతి భద్రతలు పరిరక్షిస్తామని హెచ్చరించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిలిపివేయాలి



ఆర్మూర్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిలిపివేయాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. పట్టణంలోని పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బేకరీలను మున్సిపల్ సిబ్బంది గురువారం తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని వ్యాపారులకు జరిమానాలు విధిస్తూ నోటీసులు జారీ చేశారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, రాజయ్య, సింధూజ ఉన్నారు.

హాస్టల్ ఇష్టంలేక పారిపోయిన బాలుడు

- పట్టుకొని తల్లికి అప్పగించిన పోలీసులు



బాలుడిని అతడి తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేని ఓ బాలుడు పారిపోగా, పట్టణ పోలీసులు అతడి ఆచూకీ గుర్తించి, పట్టుకొని తల్లికి అప్పగించారు. వివరాలు ఇలా.. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరింటాల గ్రామానికి చెందిన బాలుడు కామారెడ్డిలోని ఫ్రాబెల్స్ పాఠశాలలో 7వ తరగతి చదువుకుంటూ హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం అతడు హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లగా, గురువారం అతడిని తల్లి పాఠశాలలో దింపేందుకు తీసుకుని వచ్చింది. కానీ హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదని అతడు మారాం చేస్తూ పట్టణంలోని రైల్వే గేట్ వద్ద తల్లి చేయి వదిలించుకుని పారిపోయాడు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు అప్రమత్తమై గాలింపు చేపట్టారు. రెండు గంటల పాటు శ్రమించి బాలుడిని కొత్త బస్టాండ్ వద్ద గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం బాలుడిని తల్లికి అప్పగించారు.